వేకువనే.. ముంగిట్లో సంక్షేమం

- ఆస్పత్రికి వెళ్లి పలువురికి సామాజిక పింఛన్ల అందజేత
- ఒక్క రోజులో ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు

బీచ్ రోడ్డు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటి వద్దే అందజేస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతోనే ఇది సాధ్యమైందని ముక్త కంఠంతో చెబుతున్నారు. పింఛన్‌లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు రోజుల వ్యవధిలో మంజూరు చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అందరి మన్ననలు పొందుతోంది.

- జీవీఎంసీ 28వ వార్డు ఊటగెడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్న లీలాసత్యం అనారోగ్యం కారణంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో నగదు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దుర్గారావు సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. కేవలం ఒక్క రోజులోనే ఆరోగ్యశ్రీ కార్డు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అలా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డును లబ్ధిదారులు లీలాసత్యానికి గురువారం అందజేశారు. అలాగే వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేలును కూడా ఆస్పత్రిలోనే అందజేయడంతో లీలాసత్యానికి ఆనందం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందికి, కార్పొరేటర్ అప్పలకొండకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ దయవల్ల అన్నీ ముంగిటకే వస్తున్నాయని, నాలాంటి వారికి భరోసా కలుగుతోందని ఆమె చెప్పారు.



లీలాసత్యానికి పింఛన్ సొమ్ము, ఆరోగ్య శ్రీ కార్డును అందజేస్తున్న పల్లా దుర్గారావు

90 శాతం పింఛన్ల పంపిణీ

ఆరిలోవ: తూరు నియోజకవర్గంలో గురువారం పింఛన్ల పంపిణీ పండగలా జరిగింది. తెల్లవారేసరికి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి డబ్బులు అందించారు. నియోజకవర్గంలో ఉన్న 15 వార్డుల్లో 15,891 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. వారికి ప్రతి నెలా వైఎస్సార్ పెన్షన్ కానుక కింద రూ. 13.40 కోట్లు నగదు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు సుమారు 90 శాతం పైగా పింఛన్ల పంపిణీ జరిగినట్లు వార్డుల్లో సచివాలయాల సిబ్బంది తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇళ్ల వద్దకు వచ్చి రూ.3,000 పింఛను అందించడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పత్రిలో ఉన్న 22వ వార్డుకు చెందిన పడాల రమణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ పైడి దుర్గ

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో పెన్షన్ల పంపిణీ ప్రక్రియ గురువారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభమైంది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల, డయాలసిస్ రోగులకు ఇంటికి వెళ్లి వలంటీర్లు, కన్వీనర్లు పెన్షన్‌లు అందజేశారు.

బీచ్ రోడ్డు: ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చేసుకుని చికిత్స పొందుతున్న జీవీఎంసీ 22వ వార్డుకు చెందిన పడాల రమణకు వలంటీర్ పైడి దుర్గ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. తన మందుల ఖర్చులకు డబ్బులు అందాయని ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.



9వ సంజయ్‌గాంధీ కాలనీలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్, సచివాలయం కన్వీనర్



13వ వార్డు పైనాపిల్ కాలనీలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీరు, కన్వీనర్





20వ వార్డులో వృద్ధులకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్లు, కన్వీనర్లు

9న డీ వార్మింగ్ డే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు కోరారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల బాలికలకు అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున స్కూళ్లకు హాజరుకాని పిల్లలకు 16న మాత్రలు అందించాలని సూచించారు.

వీసీ ప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు



వీసీ ప్రసాద్‌రెడ్డికి తెలిపిన శుభాకాంక్షలు తెలుపుతున్న విశాలాక్షినగర్ సంఘం ప్రతినిధులు

ఆరిలోవ: ఏయూ వీసీగా రెండో సారి బాధ్యతలు చేపట్టిన ఆచార్య ప్రసాద్‌రెడ్డిని విశాలాక్షినగర్ వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. విశాలాక్షినగర్ నివాసి అయిన ప్రసాద్‌రెడ్డి వీసీగా నియామకం కావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వి.సింహాద్రిరావు, నీరజ్‌కుమార్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



శిబిరానికి ఎంపికైన విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ జాతీయ సేవా పథకం వలంటీర్లు ఎంపికయ్యారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు పంజాబ్‌లోని పటియాలాలో చిత్కర విశ్వవిద్యాలయంలో జరిగే ఈ శిబిరానికి ఏయూకు చెందిన 10 మంది విద్యార్థులు, ఓ ప్రొగ్రాం అధికారి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం అభినందించారు. జాతీయ సేవా పథకం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపయుక్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

షహజాది బేగంకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని షహజాది బేగంకు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య షేక్ జద్దాని పర్యవేక్షణలో పారిశ్రామిక వ్యర్థంగా వ్యవహరించే సిండర్ ఎగ్రిగేట్‌ను కాంక్రీట్ మిశ్రమంలో కలిపి తేలికపాటి కాంక్రీట్‌ను అభివృద్ధి చేసే విధానంపై ఆమె పరిశోధన చేశారు. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం ఆమెను విభాగాధిపతి సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు అభినందించారు.

5 నుంచి యోగా తరగతుల ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కాన్సియస్ నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి జనరల్ యోగా తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు రెండు వారాల పాటు ఉచిత యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

16వ పోలీస్ బెటాలియన్‌లో భారీగా బదిలీలు



బదిలీ అయిన అధికారులతో కమాండెంట్ గౌతమీ సాలి, తదితరులు

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ శిక్షణ కేంద్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 25 మంది అధికారులు బదిలీ అయ్యారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.శ్యామ్యూల్, పలువురు అసిస్టెంట్ కమాండెట్లు రాష్ట్రంలోని వివిధ ఏపీఎస్పీ బెటాలియన్లకు బదిలీ అయ్యారు. వీరందరినీ స్థానిక 16వ బెటాలియన్ కమాండెంట్ ఎంఎస్ గౌతమీ సాలి గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.ఎలియా సాగర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ విద్య స్కూల్‌లో విద్యార్థిపై టీచర్ దాడి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరిధి మధురవాడలోని శ్రీ విద్య స్కూల్‌లో ఓ టీచర్ విద్యార్థి తలపై రక్తం వచ్చేలా కొట్టారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం బయటకు పొక్కడంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులపై స్కూల్ యాజమాన్యం ఒత్తిడి తీసుకొచ్చి రాజీ చేసినట్టు తెలిసింది. ఈ విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా క్రమశిక్షణ, ఎక్కువ మార్కుల పేరుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్న ఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

స్టార్టప్, ఇంక్యుబేషన్‌లో ఏయూ ప్రగతి

- పర్డ్యూ విశ్వవిద్యాలయం ప్రతినిధి జూలియానా కాసావన్

ఏయూ క్యాంపస్: స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో ఏయూ వేగంగా ప్రగతి సాధిస్తోందని పర్డ్యూ విశ్వవిద్యాలయం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రొగ్రాం కన్సల్టెంట్ జూలియానా కాసావన్ అన్నారు. గురువారం సాయంత్రం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో ఆమె మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. కొద్ది రోజులుగా ఏయూ ఆ హబ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో పాల్గొన్నానని ఆమె వీసీకి తెలియజేశారు. ఏయూ స్టార్టప్ వ్యవస్థ ఎంతో వేగంగా ప్రగతిని సాధిస్తోందన్నారు. పర్డ్యూ యూనివర్సిటీకి సారూప్యత కలిగేలా ఇక్కడ వసతులు, వనరులు ఉన్నాయన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఎంటర్‌ప్రెన్యూర్ ఎకో సిస్టం నిర్మించి, అభివృద్ధి చేసిన విధానం బాగుందన్నారు. విశాఖ నగరం, అందులోనూ బీచ్ ఎంతో సుందరంగా ఉన్నాయన్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ పర్డ్యూ యూనివర్సిటీతో సంయుక్తంగా కోర్సులను నిర్వహించే దిశగా కృషి చేయాలని సూచించారు. రెండు వర్సిటీలు సంయుక్తంగా డబుల్ డిగ్రీ, ట్విన్నింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించే దిశగా పని చేయాలని చెప్పారు. అనంతరం వర్సిటీ తరఫున జూలియానా కాసివన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

డాల్ఫిన్ హిల్స్ పరిశీలన

పెదగంట్యాడ: మిలాన్–2024ను పురస్కరించుకుని యారాడ ప్రాంతంలోని డాల్ఫిన్ హిల్స్, యారాడ బీచ్ తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, నేవల్ కమాండర్ సివిల్ మిలిటరీ లైజన్ ఆఫీసర్ కిశోర్‌తో కలిసి యారాడ ప్రాంతంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మిలాన్–2024 సందర్భంగా 50 దేశాల ప్రతినిధులు, అతిథులు, నేవల్ అధికారులు అధిక సంఖ్యలో రానున్నారని డాల్ఫిన్ హిల్స్ నుంచి యారాడ బీచ్ వరకూ హెల్త్ ట్రెక్, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అయా ప్రదేశాల్లో త్వరితగతంగా పారిశుధ్య పనులు చేప ట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్–6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఈఈ రామ్మోహన్‌రావు, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



యారాడ ప్రాంతంలో పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్

పర్యావరణ క్యాలెండర్ల అందజేత



క్యాలెండర్‌ను చూపుతున్న వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: నగరంలోని అన్ని విద్యా సంస్థలకు పర్యావరణ క్యాలెండర్ అందజేస్తున్నట్లు గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్‌జీవో కార్యదర్శి జేవీ రత్నం తెలిపారు. గురువారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాల విద్యార్థులకు, ఉద్యోగులకు ఈ క్యాలెండర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించేలా అందుకు అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు తెలియజేస్తూ ఈ క్యాలెండర్ రూపొందించామన్నారు. ప్రస్తుతం నగరంలోని కళాశాలలు, పాఠశాలలకు పెద్ద ఎత్తున ఈ క్యాలెండర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

‘ఎర్త్’ జాతీయ సదస్సు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో రెండు రోజుల జరిగే జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఎర్త్ పేరుతో నిర్వహిస్తున్న ఈ సదస్సును ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుజిత్‌కమార్ త్రిపాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాలివాహన్ మాట్లాడుతూ ఐఐపీఈ అదనంగా రూ.50 కోట్లు నిధులు పొందిందని, వీటిలో పరిశ్రమల నుంచి ప్రాజెక్టుల రూపంలో రూ.38 కోట్లు సమకూరాయన్నారు. ఎన్‌టీపీసీ సహకారంతో హైడ్రోజన్ ఉత్పత్తి అంశంపై సంయుక్తంగా పనిచేస్తోందన్నారు. మహిళలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడం, విదేశీ విశ్వవిద్యాలయాలతో సంయుక్తంగా పీహెచ్‌డీ ప్రొగ్రాంల నిర్వహణ వంటివి జరుపుతున్నామన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య విజయ్ కుమార్ మాట్లాడుతూ ఇంధన రంగానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేస్తున్నట్టు తెలిపారు. పెట్రోలియం ఇంజినీరింగ్, ఎర్త్ సైన్స్ రంగాలకు చెందిన 41 మంది ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంపాల్ ద్వివేదీ, తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన వారితో ఐఐపీఈ ప్రతినిధులు

ప్రజలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం



28వ వార్డులో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



28వ వార్డులో సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న పల్లా దుర్గారావు

- రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన
- 951 మందికి వైద్య పరీక్షలు

బీచ్ రోడ్డు: ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అన్నారు. జీవీఎంసీ 28వ వార్డు నెహ్రూనగర్‌లో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలు ఆరోగ్యంపై ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకూడదని, వారందరికీ నాణ్యమైన వైద్యం అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని సీఎం శ్రీకారం చుట్టారన్నారు. ఈ శిబిరంలో 620 మందికి వైద్య సేవలు అందించారు. అత్యాధునిక చికిత్స అవసరమైన వారికి పెద్ద ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు.



22వ వార్డులో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న పీతల గోవింద్

22వ వార్డులో..

జీవీఎంసీ 22వ వార్డు మంగాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 331 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ సందర్శించి, ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు.

బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మద్దతు



ఐక్యత చాటుతున్న బీసీ సంఘం నాయకులు

దాబాగార్డెన్స్: బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మా మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు తెలిపారు. నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో బీసీలను వాడుకుంటున్న ఆయా రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేలా, రాజ్యాధికారమే లక్ష్యంగా అన్ని బీసీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి, రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలు, దళిత, ఆదివాసీ, మైనార్టీ ప్రజలను నమ్ముకుంటే బీసీ నాయకులకు ఆత్మగౌరవం, రాజ్యాధికారం, సామాజిక న్యాయం లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు ఏ రాజకీయ పార్టీ సముచిత స్థానం కల్పించి పదవులు కేటాయిస్తుందో వారికే మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పొలిటికల్ జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు, కర్రి ధనుంజయ నాయుడు, పల్ల రమణ, కామన వెంకట సుబ్బారావు, ప్రసాద్, పల్లి శ్రీనివాసనాయుడు, సంసద్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కెమికల్ ఎక్స్‌పో



ఫార్మా ల్యాబ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న బీయూ స్పెషాలిటీ ప్రొడక్ట్ ప్రెసిడెంట్ అనంత్ బర్వాదికర్



ఎక్స్‌పోలో వివిధ పరిశ్రమల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు

పరవాడ: విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఫార్మా ల్యాబ్ కెమికల్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను బీయూ స్పెషాలిటీ ప్రొడక్ట్స్ ప్రెసిడెంట్ అనంత్ బర్వాదికర్ గురువారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో జాతీయ, అంతర్జాతీయ ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు స్టాళ్లను ఏర్పాటు చేసి తమ తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఈ స్టాళ్లు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బర్వాదికర్ మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో 125 జాతీయ, అంతర్జాతీయ ఔషధ పరిశ్రమల స్టాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఫార్మా పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వైజాగ్ శ్రావణ్ షిప్పింగ్ చైర్మన్ జి.సాంబశివరావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వి.లక్ష్మణరావు, సియాంక న్యూటికల్స్ డైరెక్టర్, మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్(ఎంఏఎస్ఆర్ఎం) కార్యదర్శి జెట్టి సుబ్బారావు, వెర్దంతి లైఫ్ సైన్సెస్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎం.శివరామప్రసాద్, ఎగ్జిబిషన్ డైరెక్టర్ అజిత్‌కుమార్ శుక్లా పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు జాతీయభాష దోహదం



డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిలో రాజభాష హిందీ ఎంతగానో దోహదపడుతోందని డిఫెన్స్ టెక్నాలజీ రంగ నిపుణుడు, డీఆర్‌డీవో విశిష్ట శాస్త్రవేత్త డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. డీఆర్‌డీవో హైదరాబాద్ క్లస్టర్ పరిధి అఖిల భారత సంయుక్త రాజ్‌భాషా సైంటిఫిక్ అండ్ టెక్నాలజీ రెండు రోజుల సెమినార్ ఎన్ఎస్‌టీఎల్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభూమికి, జాతీయ భాషకు సేవ చేయాలని కోరారు. దేశం ఐక్యంగా వుండాలంటే మాధ్యమంగా హిందీభాష అవసరమన్నారు. ఐఎన్ఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ పిజు నవేరా మాట్లాడుతూ దేశం సరిహద్దులు సురక్షితంగా వుంచడంలో డీఆర్‌డీవో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. డీఆర్‌డీవో హెడ్ క్వార్టర్స్ డైరెక్టర్ (రాజభాష) డాక్టర్ రవీంద్ర సింగ్ మాట్లాడుతూ శాస్త్రీయ సమాజంలో హిందీ భాషను ప్రోత్సహించడం, అందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ భారత నౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలు అభివృద్ధి చేయడంలో ఎన్ఎస్‌టీఎల్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెమినార్‌లో పాల్గొన్న ప్రతినిధులు తమ ఆలోచనలు ఆవిష్కరించారు. అనంతరం సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెమినార్ చైర్మన్ జీసీ కేదార్‌నాథ్, కో ఆర్డినేటర్ వివేక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల్లో బీజేపీ ఎన్నికల కార్యాలయాలు

ఎంవీపీ కాలనీ: పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీజేపీ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించినట్లు ఆ పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి సూచన మేరకు వీటిని ఏర్పాటు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి గారపాటి సీతారామాంజనేయచౌదరి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ నాయకులతో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

మర్యాదపూర్వక కలయిక



ఆర్ఐవో మురళీధర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి.మురళీధర్‌ను గురువారం మద్దిలపాలెం డాక్టర్ వీఎస్.కృష్ణా జూనియర్ కాలేజీ అధ్యాపక బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. విద్యార్థుల అభ్యున్నతికి అంతా సమన్వయంతో పనిచేద్దామని ఆర్ఐవో మురళీధర్ వారికి సూచించారు. ఆర్ఐవోను సత్కరించిన వారిలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు మురళీకృష్ణ, హేమంత్‌కుమార్, వేదవ్యాస్, గోవిందరావు, ఆర్.పి.నాయుడు, సన్యాసిరావు, రాజశేఖర్‌రెడ్డి, సూర్యకుమారి తదితరులు ఉన్నారు.